# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాలతో సుపరిపాలన అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి అత్యంత నిబద్ధతతో పని చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.
- ❖ కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు.
- ❖ విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యతాయుత దృక్పథాన్ని పెంపొందించడం విద్యా సంస్థల బాధ్యత అని విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ అన్నారు.

========================

రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాలతో సుపరిపాలన అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా "రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం" పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఈరోజు జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ.. 2024 ఎన్నికల ఫలితాలను గెలుపుగా కాక.. రాష్ట్ర పునర్నిర్మాణానికి అప్పజెప్పిన బాధ్యతగా భావించామన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను, నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తున్నామని, 175 ఎం.ఎస్.ఎం.ఈ. పార్కులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందన్న ముఖ్యమంత్రి.. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా వివిధ అంశాల్లో కేంద్రం అండగా నిలిచిందన్నారు. వివిధ పారిశ్రామిక పాలసీల ద్వారా పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని కల్పించామని, ఫలితంగా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

========================

కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. గడిచిన రెండేళ్లలో అనేక కార్మిక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి.. అమలు చేసామని తెలిపారు. ఈ - శ్రమ్ పోర్టల్ ద్వారా కోటిన్నర మంది కార్మికుల వివరాలను నమోదు చేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డులను నెలకొల్పామని తెలిపారు. కొత్త కార్మిక చట్టాలకు అనుగుణంగా ప్రత్యేకంగా కోర్టులను ఏర్పాటు చేసామన్నారు. మహిళా కార్మికులు రాత్రివేళల్లో పని చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని, దుకాణాలకు జీవిత కాల అనుమతుల విధానాన్ని తీసుకువచ్చామని మంత్రి వివరించారు.

========================

విద్యార్థుల్లో నిజాయితీ, నైతికత, సమాజం పట్ల బాధ్యతాయుత దృక్పథాన్ని పెంపొందించడం విద్యా సంస్థల బాధ్యత అని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. విశాఖలో ఈరోజు జరిగిన "డిజీ 100 ఎక్స్ ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్" ప్రారంభ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ.. ఈ సదస్సు విద్యా రంగంలో పరస్పర అభ్యాసం, అనుభవాల మార్పిడి, సృజనాత్మక చర్చలకు వేదికగా నిలుస్తుందని, దేశ ఉన్నత విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని అన్నారు.

========================

రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలిలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి.. రెండేళ్ల కూటమి ప్రభుత్వ పరిపాలనను వివరించారు. రైతుల సహకారంతో ఫైన్ రైస్ తో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని, ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా వేలాది మందికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అవసరమైన వారికి ఆర్థిక సాయం అందించడంతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా సీసీ రోడ్లు, ఆర్ & బి రోడ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు.

విరామం

========================

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి అత్యంత నిబద్ధతతో పని చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్ శాఖా మంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. తిరుపతి సమీపంలో ఈరోజు జరిగిన `రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం` సభలో ఆయన మాట్లాడుతూ... రెండేళ్ల క్రితం ప్రజలు ఇచ్చింది కేవలం అధికారంగా కాక బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ఎన్నికైన ప్రధానిగా నిరంతరాయంగా సుదీర్ఘకాలం పనిచేసిన నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపిన ఆయన.. ఎన్డీయే సమిష్టి కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపగలిగామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని ఉప ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకెన్లు)

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు స్వేచ్ఛ లభించిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. డీఎస్సీ ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకెన్లు)

========================

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ పేటుకూరి సూర్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. విజయనగరంలో ఈరోజు జరిగిన `ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం`లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మన దేశం వికసిత్ భారత్ లక్ష్యం సాధించాలంటే చిన్నారులంతా తప్పక చదువుకోవాలని సూచించారు.

========================

విశాఖ విమల విద్యాలయానికి పూర్వవైభవం తీసుకురావాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ ఉపాధ్యాయులకు సూచించారు. గతంలో మిషనరీ ఆధ్వర్యంలో నిర్వహించి మూసివేసిన ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయాన్ని ఆయన ఈరోజు శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజుతో కలసి పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పాఠశాలలో పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని, “బడి పిలుస్తోంది” కార్యక్రమం ద్వారా ప్రవేశాలు పెంచాలని సూచించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ తో మాట్లాడి.. పాఠశాలలో మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాలని, ఉపాధ్యాయులు- తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలనను నిరసిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ శ్రేణులు ఈరోజు పలు చోట్ల నిరసనలు చేపట్టారు. అలాగే.. డీఎస్సీలో అన్యాయం జరిగిన వారికి సంఘీభావంగా కూడా నిరసన ర్యాలీలు నిర్వహించారు. కాగా.. వైసీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను చంద్రబాబు నాయుడు మోసం చేశారని ఆరోపించారు.

========================
========================